సాక్షి నిజామాబాద్

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



ట్రాఫిక్ అస్తవ్యస్తం

నగరంలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

- IIలో ▸



చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్

కామారెడ్డిలో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసింది. దొంగల ముఠా సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- IVలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.8 /23.3

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం మేఘావృతమై అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా టెట్



నిజామాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం టెట్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం మొదటి పేపర్ పరీక్షకు 15,263 మంది అభ్యర్థులకు గాను 12,520 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం రెండో పేపర్ పరీక్షకు 11573 మందికి గాను 10395 మంది హాజరయ్యారు. మొదటి పేపర్‌కు 64, రెండో పేపర్‌కు 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లో గల ఎస్‌పీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రం వద్ద పోలీసు బందోబస్తును పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ వివిధ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. నగరంలోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో మద్నూర్ నుంచి మహిళా అభ్యర్థిని సమయానికి రాకపోవడంతో అధికారులు అనుమతించలేదు.

ఆర్మూర్ విద్యుత్ డివిజన్‌లో విచారణ

- వివరాలు బయటకు రానివ్వని అధికారులు
- నేరుగా సీఎండీకి నివేదిక

నిజామాబాద్‌నాగారం/ఆర్మూర్ టౌన్: జిల్లాలోని ఆర్మూర్ డివిజన్ పరిధిలో రెండు రోజుల పాటు టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీజీఎం ఆడిటర్ రవీంద్రనాథ్ ప్రత్యేక విచారణ చేపట్టారు. అధికారులు, ఉద్యోగులు ఒకరినొకరిపై చేసుకున్న ఫిర్యాదుపై, 'సాక్షి'లో వచ్చిన కథనాలకు స్పందించిన సీఎండీ గోపాల్ రావు మేరకు విచారణకు ఆదేశించారు. డివిజన్ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లకు సంబంధించి, అదేవిధంగా యూనియన్ నాయకులతో విచారించారు. అంకాపూర్‌లో జరిగిన టీఅండ్‌డీ పనులు, మాక్లూర్ మండలం చిన్నాపూర్‌లో నిధుల దుర్వినియోగంపై ప్రత్యేకంగా సీజీఎం వెళ్లి పరిశీలించారు. ఆర్మూర్ డీఈ చాంబర్‌లో సుదీర్ఘంగా విచారించారు. కాగా విచారణకు సంబంధించిన విషయాలను అధికారులు బయటకు రానివ్వలేదు. నివేదికను నేరుగా సీఎండీకి అందజేయనున్నట్లు తెలిసింది. విచారణలో సీనియర్ అకౌంట్ ఆఫీసర్ రాజశేఖర్ ఉన్నారు.

హిందుత్వంపై ఆసక్తి పెంచేందుకు చేయూత

- ఐదు కౌంటర్ల ద్వారా గణేశ్ చందాలు రాసిన ధన్‌పాల్



చందా అందిస్తున్న సూర్యనారాయణ

సుభాష్‌నగర్: హిందుత్వంపై యువతలో ఆసక్తి పెంచేందుకు తనవంతుగా గణేశ్ మండపాలకు చేయూతనందిస్తున్నానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని మార్వాడీగల్లిలో తన స్వగృహంలో ధన్‌పాల్ గణేశ్ మండపాలకు రెండోరోజు శుక్రవారం ఐదు కౌంటర్ల ద్వారా చందాలు రాశారు. ఆయన మాట్లాడుతూ ప్రతియేడాదిలాగే మా తల్లిదండ్రులు ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండపాలకు చేయూనందిస్తున్నానని అన్నారు. రాజకీయాలు, కుల, మతాలకతీతంగా యువతను ప్రోత్సహిస్తున్నామన్నారు. గతేడాది 350 పైచిలుకు గణేశ్ మండపాలకు ట్రస్ట్ చేయూతనివ్వడం వల్లే హిందుత్వంపై ఆసక్తి పెరిగేలా చేసిందన్నారు. ఈఏడాది 528 మండపాలకు చేయూతనందిస్తున్నామని తెలిపారు. హిందూ పండుగలను ప్రోత్సహించే కార్యక్రమాలకు ఎల్లవేళలా తన ఇంటి తలుపులు తెరిచే ఉంటాయన్నారు. గణేశ్ ఉత్సవాలను ప్రజలంతా ఐక్యంగా ఉండి శాంతియుతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మండపాల వద్ద అధికారులు వేధింపులకు గురి చేస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. హిందూ పండుగలపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, విద్యుత్ బిల్లులు వసూలు చేయడం వంటి కార్యక్రమాలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



తరలివచ్చిన మండపాల నిర్వాహకులు

అపరిశుభ్రత.. అసౌకర్యాలు



ఆర్మూర్‌లోని కేజీబీవీ కళాశాల భవనం పక్కనే నిలిచిన మురికి నీరు

- కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థినులకు అవస్థలు
- పాముల భయం, దోమల బెడద
- ఇరుకు గదుల్లో సర్దుకోవాల్సిన పరిస్థితి
- చదువు, పడక ఒకే గదిలో
- వెలుగు చూసిన నిజాలు



అమ్దాపూర్ కస్తూర్బా చుట్టూ నిలిచిన మురుగు నీటిని పరిశీలిస్తున్న ఎంఈవో నాగ్‌నాథ్

కస్తూర్బా విద్యాలయాల్లో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థినులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. రుద్రూర్, ఏర్గట్ల, ముప్కాల్, మెండోరా, మోపాల్ కేజీబీవీలకు సొంత భవనాలు లేవు. జిల్లాలోని కేజీబీవీల్లో 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్ నిర్వహించింది.

- సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

- ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆర్మూర్, నందిపేట, మాక్లూర్ మండలాల్లోని కేజీబీవీల్లో సమస్యలు నెలకొన్నాయి. ఆర్మూర్, నందిపేట కేజీబీవీల ఆవరణలు మురికి కూపాలను తలపిస్తున్నాయి. ప్రాంగణం మైదానంలో మురికి నీరు నిలువ ఉండి దోమలు విజృంభిస్తున్నాయి. పాముల బెడద ఆందోళన కలిగిస్తోంది. నందిపేట కేజీబీవీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే మురికి నీరు నిలిచి ఉంది. అపరిశుభ్ర పరిసరాలతో బాలికలు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. మాక్లూర్ కేజీబీవీకి ప్రహరీ లేదు. కిటికీలకు తలుపులు లేనందున మారుతున్న వాతావరణ పరిస్థితులతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. బాలికల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ఉన్నతాధికారులకు సమస్యలను నివేదించినా బడ్జెట్ లేని కారణంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు.
- నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం మోపాల్ మండలంలో రెండు కేజీబీవీలు ఉన్నాయి. సొంత భవనంలోని కేజీబీవీలో 323 మంది, అద్దె భవనం కేజీబీవీలో 196 మంది బాలికలు ఉంటున్నారు. వారికి తరగతి గది, పడక గది ఒకటే.. వసతులు లేక బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. నిజామాబాద్ రూరల్ కేజీబీవీ కోసం ఆకుల కొండూర్‌లో సొంత భవనం నిర్మించగా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. బియ్యంలో పురుగులు వస్తున్నాయని, కూరగాయలు, సరుకులు నాసిరకంగా సరఫరా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లు మెనూ ప్రకారం, విద్యార్థుల సంఖ్యకనుగుణంగా సరుకులు సరఫరా చేయడం లేదు.



సిరికొండ కేజీబీవీలో ఒకే గదిలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థినులు

- ఇందల్వాయి తిర్మన్ పల్లి శివారులోని కేజీబీవీ అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉంది. ప్రహరీ లేకపోవడంతో వన్యప్రాణులు పాఠశాలలోకి వస్తున్నాయని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు సరైన రోడ్డు మార్గం లేదు. ఐరన్ రెయిలింగ్ లేకపోవడంతో మూలాన వంటగదిలోకి కోతులు వస్తున్నాయి.
- సిరికొండ మండలం సరిపల్లి తండా శివారులో గల కేజీబీవీ లో గదుల కొరత విద్యార్థులను వేధిస్తోంది. ఆరు, ఏడు తరగతుల విద్యార్థినులు ఒకే గదిలో చదువుకుంటూ దాంట్లోనే నిద్రిస్తున్నారు.
- జక్రాన్‌పల్లి కేజీబీవీలో డెస్క్ బెంచీలు లేవు. వర్షం నీరు గోడల నుంచి కారి విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.
- ధర్పల్లి కేజీబీవీలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ఎన్నిసార్లు మరమ్మతులు చేపట్టినా సమస్య పరిష్కారం కావడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు.
- బాల్కొండ నియోజకవర్గంలో మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల కస్తూర్బా పాఠశాలల్లో సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు. భీంగల్ ఘటన నేపథ్యంలో వంట చేసే చోట కలుషిత పదార్థాలు లేకుండా చేసి, పాత్రలను శుభ్రం చేశారు. కమ్మర్‌పల్లి పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు దూరంగా ఉండటం, పరిసరాలు బురదమయం కావడంతో విద్యార్థులు ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. వేల్పూర్ పాఠశాల చుట్టూ గడ్డి మొలకెత్తగా పచ్చలనడ్కుడ గ్రామ పంచాయతీ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. భీంగల్ కేజీబీవీ నుంచి విద్యార్థులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లడంతో అప్రకటిత సెలవు ప్రకటించినట్లు అయ్యింది.



అమ్దాపూర్ కస్తూర్బాలో పైప్ తొలగింపుతో బయటపడిన మురుగు నీరు



బురదమయంగా సిరికొండ కేజీబీవీ రోడ్డు

బోధన్ మండలంలోని అమ్దాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల భవనం చుట్టూ మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడద పెరిగింది. బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతంలో భవనం ఉన్నందున వర్షం నీరు ప్రాంగణంలోకి చేరుతోంది. మురుగు కాలువల అంతర్గత పైప్‌లైన్ నుంచి నీటి పారకం నిలిచిపోవడంతో పైప్‌లను తొలగించారు. మురుగు నీరు ఆరుబయట ప్రవహిస్తోంది. మురుగు నీరు తరగతి గదుల వెనుక నిలిచిపోయింది. ఇరుకు వంట గది అపరిశుభ్రంగా ఉంది.



అమ్దాపూర్ కస్తూర్బా కళాశాలలోని డైనింగ్ హాల్‌లో వంట సరుకులు, వంట పనులు



అటవీ ప్రాంతంలో ప్రహరీ లేని ఇందల్వాయి కేజీబీవీ

జిల్లాలో మొత్తం కేజీబీవీలు	34
ఇంటర్ విద్యనూ అందిస్తున్నవి	9
విద్యార్థులు	6,542
టీచర్లు	345
నాన్‌టీచింగ్ సిబ్బంది	362

పాములు వస్తున్నాయి..

పరిసరాల్లోని ఇళ్ల నుంచి వచ్చిన మురికి నీరంతా పాఠశాల మైదానంలో నిలవడంతో పాములు వస్తున్నాయి. భయంతో మైదానంలో ఆటలాడలేకపోతున్నాము.

– దివ్య, పదో తరగతి, కేజీబీవీ, ఆర్మూర్



కిటికీలకు తలుపులు లేవు..

కిటికీలకు తలుపులు లేకపోవడంతో వర్షాకాలం, చలికాలంలో ఇబ్బందులు పడుతున్నాము. విద్యార్థినులు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

– వైష్ణవి, పదో తరగతి, కేజీబీవీ, మాక్లూర్



ఆవరణ కంపు కొడుతోంది..

పాఠశాల ఆవరణలో మురికి నీటి గుంతలు ఉండటంతో దుర్వాసన వస్తోంది. డ్రైనేజీ వ్యవస్థలేక విద్యార్థులు వాడిన నీళ్లు పాఠశాల ఆవరణలోనే నిలుస్తున్నాయి.

– నక్షత్ర, తొమ్మిదో తరగతి, కేజీబీవీ, నందిపేట



ప్రహరీ నిర్మాణం చేపట్టాలి..

పాఠశాలకు ప్రహరీ లేని కారణంగా భద్రత పరంగా సమస్యలనెదుర్కొంటున్నాము. ప్రభుత్వం వెంటనే కేజీబీవీల్లో సమస్యలను పరిష్కరించాలి.

– సవిత, ఇన్‌చార్జి ఎస్‌వో, కేజీబీవీ, మాక్లూర్



డీఐజీగా సత్యనారాయణ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణకు డీఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. సీపీ సత్యనారాయణ డీఐజీగా ప్రమోషన్‌లో ఉన్నట్లు ప్రచారం ఉంది. డీఐజీ చంద్రశేఖర్‌రెడ్డి నిజామాబాద్ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. సీపీ సత్యనారాయణకు డీఐజీగా ఉద్యోగోన్నతి రావడంతో అదనపు బాధ్యతలు చేపట్టాలని డీజీపీ అంజనీకుమార్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

బోగస్ ఓట్ల విచారణకు ప్రత్యేకాధికారి

- బీజేపీ నేతల ఫిర్యాదుకు స్పందించిన సీఈవో వికాస్‌రాజ్



క్రిస్టీనా జడ్ చోంగ్తు

సుభాష్‌నగర్/బోధన్: బోధన్ లో వెలుగు చూసిన బోగస్ ఓట్ల నమోదుపై విచారణకు ఐఏఎస్ అధికారి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చోంగ్తును నియమిస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌ను హామీ ఇచినట్లు బీజేపీ ఎన్నికల సంఘం వ్యవహారాల కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ తెలిపారు. శుక్రవారం వారు హైదరాబాద్‌లో సీఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ బోధన్ నియోజకవర్గంలో జూలై 20 నుంచి సెప్టెంబర్ 5 వరకు 8 పోలింగ్ స్టేషన్లలో సుమారు 4,024 మంది కొత్త ఓట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో మహారాష్ట్రకు చెందిన ముస్లిం మైనారిటీలే ఎక్కువగా ఉన్నారన్నారు. బోధన్ నియోజకవర్గంలో ఓట్ల నమోదు కోసం దాదాపు 11,402 దరఖాస్తులు రాగా అత్యధికంగా ముస్లిం సామాజికవర్గానికి చెందిన వారేనన్నారు. బూత్ నంబర్ 88లో పబ్లిక్ టాయిలెట్ల అడ్రస్‌తో కొన్ని దరఖాస్తులు వచ్చాయని సీఈఓ దృష్టికి తెచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడితో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేపట్టకపోవడంతో నకిలీ ఓటర్ల తొలగింపు సాధ్యం కావడం లేదన్నారు. బీజేపీ బోధన్ నియోజకవర్గ బాధ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, సీనియర్ అడ్వొకేట్ ఆంటోని రెడ్డి ఉన్నారు.



సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అర్వింద్

మట్టి గణపతులనే పూజిద్దాం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మట్టిగణపతులను పంపిణీ చేస్తున్న కలెక్టర్

నిజామాబాద్‌నాగారం: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను ప్రతిష్ఠించి, వినాయక చతుర్థి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం సుభాష్‌నగర్‌లోని జిల్లా పరిషత్ కూడలి వద్ద మట్టి గణపతులు పంపిణీ చేశారు. మట్టి విగ్రహాల ఆవశ్యకతను తెలియజేస్తూ గోడ ప్రతులను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. విగ్రహాల నిమజ్జనంతో నీరు కలుషితమవుతుందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఐదేళ్లుగా మట్టి విగ్రహాలను ప్రజలకు అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు పర్యావరణ హితం కోసం మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలని కోరారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ ఆఫీసర్ లక్ష్మణ్ ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్, నర్సయ్య, వయోజన విద్యా శాఖ అధికారి ఆనంద్, పొల్యూషన్ బోర్డు కార్యాలయ సిబ్బంది మానస, తిరుపతి పాల్గొన్నారు.

పేదలకు చేరువలో వైద్య విద్య

- ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుతో అవకాశం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ర్యాలీ, కృతజ్ఞత సభ



సభలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు



సీఎం ప్రసంగాన్ని స్క్రీన్‌పై చూస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి, కామారెడ్డి /కామారెడ్డి టౌన్: పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ దేశంలోనే అగ్రగామిగా నిలిపారని, పేద విద్యార్థులు వైద్య విద్య అభ్యసించడానికి జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీని శుక్రవారం సీఎం కేసీఆర్ వర్చువల్‌గా ప్రారంభించారు. కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా సీఎం ప్రసంగాన్ని స్పీకర్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు తిలకించారు. అనంతరం నిజాంసాగర్ చౌరస్తా నుంచి రైల్వే బ్రిడ్జి, పోలీస్ స్టేషన్ రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి మీదుగా సుభాష్‌రోడ్డు వరకు కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పలువురు నేతలు ప్రసంగించారు. స్పీకర్ పోచారం మాట్లాడుతూ... మెడిసిన్ చదవాలంటే ఖర్చుతో కూడుకున్నదని, సీఎం కేసీఆర్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలతో పేద విద్యార్థులకు ఉచితంగా చదువుకునే అవకాశం దక్కిందన్నారు. మెడిసిన్ చదివే ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.50 లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఏటా పదివేల మంది డాక్టర్లు తయారవుతారని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కూడా ఉండేవి కావన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం చొరవతో రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలు ఎంతో మెరుగయ్యాయన్నారు. హైదరాబాద్ నగరానికి నలుమూలల పెద్ద పెద్ద ఆస్పత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడంతో ఆయా పట్టణాల్లో పెద్ద ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కిడ్నీ, లివర్ మార్పిడీలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. కామారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో 330 పడకల ఆస్పత్రి వచ్చిందని, వైద్యంలో ఎంతో అవగాహన ఉన్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో మెరుగైన వైద్య సేవలందుతాయన్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. కామారెడ్డిని జిల్లాగా ఏర్పాటు చేయడం, వైద్య కళాశాల ఏర్పాటు చేసిన సీఎంకు కామారెడ్డి ప్రజలు రుణపడి ఉంటారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ సింధే మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలో అగ్రగామిగా నిలిపారన్నారు. సభలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదర్ శోభ, వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, వైస్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ, బీఆర్‌ఎస్ నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

మొదట కామారెడ్డిలోనే..

వర్చువల్ ద్వారా వైద్య కళాశాలలను ప్రారంభించే సమయంలో సీఎం కేసీఆర్ మొదట కామారెడ్డి జిల్లాతోనే మొదలు పెట్టారు. కామారెడ్డిలో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేల పేర్లను ప్రస్తావించారు.

అట్టహాసంగా ప్రారంభోత్సవం

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. స్పీకర్ పోచారం, విప్ గోవర్ధన్, ఎమ్మెల్యేలు సురేందర్, సింధేతో పాటు కలెక్టర్ పాటిల్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

అస్సాం సీఎంను కలిసిన దినేశ్‌కుమార్‌



డిచ్‌పల్లి: అస్సాం సీఎం హేమంత బిశ్వశర్మను బీజేపీ రూరల్‌ ఇన్‌చార్జి కులాచారి దినేశ్‌కుమార్‌, డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వారి వెంట పార్టీ నాయకులు శ్రావణ్‌, రాంగోపాల్‌ వినోద్‌రెడ్డి ఉన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 18968 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా 15 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3 వేలు, లక్ష్మి కాలువ ద్వారా 150, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి అదేస్థాయిలో నిల్వ ఉంది.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



నిజామాబాద్‌నాగారం: మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు మెప్మా సహాయ సహకారాలు అందిస్తుందని మెప్మా పీడీ రాజేందర్‌ అన్నారు. నగరంలోని న్యూ అంబేడ్కర్‌ భవన్‌లో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు మెప్మా సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. వ్యాపార సంస్థలు నెలకొల్పేందుకు కావాల్సిన శిక్షణ, రుణ సౌకర్యం, పరిశ్రమ స్థాపనకు అవసరమైన యంత్రాలు, మార్కెటింగ్‌ సౌకర్యం, ఇతర నైపుణ్యాలు మెప్మా ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్‌ టౌన్‌ ప్రాజెక్ట్‌ అధికారి రమేశ్‌, మెప్మా అధికారి మాధురి, పీఆర్పీ శోభ, తరుణ్‌, విక్రాంత్‌ పాల్గొన్నారు.

19వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



కామారెడ్డి టౌన్‌: తమ సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష అభియాన్‌ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 19వ రోజుకు చేరుకుంది. మున్సిపల్‌ కార్యాలయం ముందు సమ్మె శిబిరంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్‌ చేశారు. నాయకులు సత్యనారాయణ, శైలజ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ అస్తవ్యస్తం

- అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్‌
- ఇబ్బందుల్లో నగర ప్రజలు



బస్టాండ్‌ ఎదుట రోడ్డుపై నిలిచిన ఆటోలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్‌ అస్తవ్యస్తంగా మారింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రయాణించాలంటేనే వాహనాదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని వ్యాపార కేంద్రాలు, ఆసుపత్రులు, రైల్వేస్టేషన్‌, బస్టాండ్‌ దగ్గర పగలూ రాత్రి అనే తేడా లేకుండా వాహనాలు కిటకిటలాడుతాయి. ఆసుపత్రుల్లు, వ్యాపార కేంద్రాలు, రైల్వేస్టేషన్‌, కోర్టు చౌరస్తా వద్ద వాహనా లను ఇష్టారీతిన నిలపడంతో రాకపోకలకు అంతరా యం ఏర్పడుతోంది. అంతేకాకుండా రోడ్లపై తోపుడు బండ్ల నిర్వాహకులు సైతం ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తుండడంతో సమస్య మరింత ఎక్కువవుతోంది. దీంతో నగరంలో తీవ్ర ట్రాఫిక్‌ సమస్య నెలకొంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వాహనాలు సైతం విపరీతంగా పెరుగుతున్నాయి.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

నగరంలో గాంధీచౌక్‌, బస్టాండ్‌, మెడికల్‌ కాలేజీ, బస్టాండ్‌, జీజీహెచ్‌ వద్ద షాపింగ్‌ కాంప్లెక్స్‌, పాలిటెక్నిక్‌ కాలేజీ, ఆర్యనగర్‌, శివాజీనగర్‌, దేవీటాకీస్‌, తిలక్‌గార్డెన్‌, మున్సిపల్‌ కాంప్లెక్స్‌లలో ఉన్న ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు ఆక్రమిస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారు. దీంతో పాదచారులు ఫుట్‌పాత్‌లపై వెళ్లడానికి అవకాశం లేకుండా పోతోంది.

ఉంటుంది. ఇక్కడ వ్యాపార కేంద్రాలు ఎక్కువగా ఉండడంతో దుకాణాలకు వచ్చే కొనుగోలు దారులు తమ వాహనాలను రోడ్డుపై ఉంచడంతో ట్రాఫిక్‌ సమస్య నెలకొంటోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేదు.

ఇరుకు ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు

నగరంలోని పూసలగల్లీతోపాటు దేవీరోడ్డు, బోధన్‌ చౌరస్తా, కిసాన్‌గంజ్‌, పిక్చర్‌ ప్యాలెస్‌ ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ సమస్య అధికంగా

ఆటోలతో ఇబ్బందులు

నగరంలో ఎక్కువగా ఆటోలతో ట్రాఫిక్‌ సమస్య నెలకొంటోంది. జిల్లాలో సుమారు 28 వేల ఆటోలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. నగరంలోని బస్టాండ్‌, జీజీహెచ్‌, రైల్వేస్టేషన్‌ తోపాటు గాంధీచౌక్‌ ప్రాంతాల్లో ఆటోలను రోడ్లపైనే ఉంచుతారు. బస్టాండ్‌ వద్ద ఆటోలను రోడ్డుపై నిలిపి ఉంచడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలను నియంత్రించి ట్రాఫిక్‌ లేకుండా ఉండాలని వాహనాదారులు కోరుతున్నారు.

హాస్పిటళ్లకు సెల్లార్లు లేకపోవడంతో..

నగరంలోని ఖలీల్‌వాడిలో ఆసుపత్రులు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ ఆసుపత్రులకు సెల్లార్లు సక్రమంగా లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వన్‌వే ఏర్పాటు చేసి ఇటీవల తీసేశారు. ఖలీల్‌వాడిలో నిత్యం ట్రాఫిక్‌ సమస్యలు నెలకొంటున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సెల్లార్లు లేని హాస్పిటళ్లకు అనుమతుల ఇవ్వడంపై మున్సిపల్‌ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రగతినగర్‌లో సైతం కొత్తగా ప్రారంభమైన హాస్పిటళ్లలో సైతం సెల్లార్లు లేకపోవడంతో వాహనాదారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ట్రాఫిక్‌ సమస్య అధికంగా నెలకొంటోంది. ఇకనైనా ఉన్నత అధికారులు ట్రాఫిక్‌ సమస్యపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు

నగరంలో తీవ్ర ట్రాఫిక్‌ సమస్యలతో పాటు రాంగ్‌రూట్‌ ప్రయాణాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీని మూలంగా రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనాలను ప్రమాదాలకు గురవుతున్నాయి. స్పందించిన పోలీసులు నాటి నుంచి రాంగ్‌రూట్‌ వచ్చే వాహనాలపై జరిమానా విధించి కేసు నమోదు చేస్తున్నారు. నగరంలోని ప్రధానంగా దేవీటాకీస్‌, వినాయక్‌నగర్‌ హనుమాన్‌ మందిరం, బోధన్‌రోడ్డు, ఖిల్లా చౌరస్తా, ఆటోనగర్‌, కంఠేశ్వర్‌, పులాంగ్‌, శివాజీనగర్‌ చౌరస్తా, రైల్వేస్టేషన్‌, బస్టాండ్‌, ఎల్లమ్మగుట్ట చౌరస్తా, ఖలీల్‌వాడి ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లలో ప్రయాణాలు కొనసాగుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచిన వాహనాలు

క్యాంపస్‌ కబుర్లు

శ్వేతకు డాక్టరేట్‌



శ్వేతకు డాక్టరేట్‌ను అందిస్తున్న ప్రొఫెసర్‌ రాంబాబు

తెయూ(డిచ్‌పల్లి): టీయూ కామర్స్‌ విభాగం కాంట్రాక్ట్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఎస్‌. శ్వేత ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్‌ సాధించారు. టీయూ కామర్స్‌ సీనియర్‌ ప్రొఫెసర్‌ జి.రాంబాబు పర్యవేక్షణలో 'నిజామాబాద్‌లో గల బీడీ కార్మికుల జీవన ప్రమాణాలు – ఉపాధి సమతుల్యత' అనే అంశంపై శ్వేత పరిశోధన చేసి ఓయూకు సమర్పించారు. డాక్టరేట్‌ సాధించిన శ్వేతను టీయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం యాదగిరి, కామర్స్‌ డీన్‌ ప్రొఫెసర్‌ రాంబాబు, అధ్యాపకులు, పరిశోధకులు అభినందించారు.

తెయూ సిబ్బందిని రెగ్యులరైజ్‌ చేయాలి



నిరసన తెలుపుతున్న తెయూ ఔట్‌ సోర్సింగ్‌ సిబ్బంది

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్‌ని రెగ్యులరైజ్‌ చేయాలని తెయూ ఔట్‌సోర్సింగ్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ అధ్యక్షుడు బట్టు సురేశ్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం టీయూ క్యాంపస్‌లోని న్యూబాయ్స్‌ హాస్టల్లో సిబ్బంది నిరసన తెలిపారు. చాలీచాలని వేతనంతో పని చేస్తూ ఇబ్బందులు పడుతున్నామని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్‌ కార్యదర్శి బీకోజీ, సభ్యులు నరేశ్‌, మధులిక, ఆసిఫ్‌, రవీందర్‌, గులాబ్‌, సతీశ్‌, సుధీర్‌, పీరు, దిగంబర్‌, బబ్లు, శ్రీధర్‌, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఇంజినీర్స్‌డే



ఎస్‌ఈని సన్మానిస్తున్న ప్రాజెక్ట్‌ అధికారులు



జెన్‌కోలో నివాళులర్పిస్తున్న ఇంజినీర్లు

బాల్కొండ: మెండోరా మండలం శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌, జెన్‌కో కార్యాలయం, పంచాయతీరాజ్‌, ఆర్‌అండ్‌బీ కార్యాలయాల్లో జాతీయ ఇంజినీర్స్‌డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి అధికారులు, ఉద్యోగులు, ఇంజినీర్లు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ప్రాజెక్ట్‌ ఎస్‌ఈ శ్రీనివాస్‌, ఈఈ చక్రపాణి, జెన్‌కో ఎస్‌ఈ శ్రీనివాస్‌, డీఈజె శ్రీనివాస్‌, ఆర్‌అండ్‌ బీ డీఈఈ రవీందర్‌, పీఆర్‌ డీఈఈ మహేందర్‌రెడ్డి, ఇంజినీర్లు పాల్గొన్నారు.

అధిక యూరియాతో ఎండాకు తెగులు



బొప్పాపూర్‌లో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రుద్రూర్‌/వర్ని: అధిక యూరియాతో వరి పంటలో ఎండాకు తెగులు సోకుతున్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తెలిపారు. రుద్రూర్‌, కోటగిరి, వర్ని, చందూర్‌, మోస్రా మండలాల్లోని పలు గ్రామాల్లో రాజేంద్రనగర్‌ వరి పరిశోధన స్థానం, రుద్రూర్‌ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు శుక్రవారం పర్యటించి పంటలను పరిశీలించారు. తెగులు నివారణకు సమగ్ర ఎరువుల యాజమాన్యంతో పాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. శాస్త్రవేత్తలు రామ్‌గోపాల్‌వర్మ, చంద్రమోహన్‌, కిరణ్‌ బాబు, కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌ టి. అంజయ్య, విజయ్‌ కుమార్‌, రాజ్‌కుమార్‌, కోటగిరి వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, రుద్రూర్‌ జడ్పీటీసీ నరోజి గంగారాం, భవానిపేట్‌ సర్పంచ్‌ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

తపాలశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న అధికారులు

ఎడపల్లి(బోధన్‌): ప్రతి ఒక్కరూ తపాలశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్‌ అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ రాజనర్సాగౌడ్‌ అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం తపాల శాఖ, భారత ప్రభుత్వం గ్రామీణ తపాల జీవిత బీమా సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు పథకాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామీణ తపాలా జీవిత బీమాలో సభ్యత్వం తీసుకున్న వారికే ఈ అవకాశం ఉంటుందన్నారు. రూ. 500 చెల్లించి ఖాతాను ప్రారంభం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురికి ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ మోతీసింగ్‌, ఎంపీడీవో గోపాలకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

– సీపీ సత్యనారాయణ



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ



మోర్తాడ్‌లోని పీఎస్‌ను సందర్శిస్తున్న సీపీ

ఆర్మూర్‌టౌన్‌/ మోర్తాడ్‌/ భీమ్‌గల్‌/ కమ్మర్‌పల్లి: సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని సీపీ సత్యనారాయణ అన్నారు. ఆర్మూర్‌, మోర్తాడ్‌, భీమ్‌గల్‌, కమ్మర్‌పల్లి, మోర్తాడ్‌, ఏర్గట్ల మండలాల్లోని పీఎస్‌లను సీపీ శుక్రవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. వినాయక చవితి, మిలాద్‌ ఉన్‌–నబీ వేడుకలకు బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్మూర్‌ ఏసీపీ జగదీశ్‌చందర్‌, ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు, భీమ్‌గల్‌ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అనిల్‌రెడ్డి, హరిబాబు, మశ్చేందర్‌రెడ్డి, భీమ్‌గల్‌ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై హరిబాబు, సిబ్బంది ఉన్నారు.

నకిలీ ధ్రువపత్రాలు సమర్పిస్తే చర్యలు

నిజామాబాద్‌అర్బన్‌: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా నకిలీ వైద్యధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే చర్యలు తీసుకుంటామని డీఈవో దుర్గాప్రసాద్‌ హెచ్చరించారు. స్పౌస్‌ ఉపాధ్యాయులు తమ స్థానానికి దగ్గరగా ఉన్న ప్రాంతాన్ని కోరుకోవాలని, దానికి బదులు నకిలీ వైద్య ధ్రువీకరణపత్రాలు సమర్పిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. వెబ్‌ ఆప్షన్‌ ఎంచుకునే సందర్భంలో నిబంధనలు పాటించాలన్నారు.

ఎన్‌వైకే ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

నిజామాబాద్‌నాగారం: నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో శుక్రవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ స్థానంలో శ్రీజ జాదవ్‌, ద్వితీయ స్థానంలో చరణ్‌తేజ నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారిణి బెల్లాల్‌ శైలి మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైన వారు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం శ్రీజ జాదవ్‌, చరణ్‌తేజలను అభినందించారు.

లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలి



రాష్ట్రపతి ముర్ముతో వీరశైవ లింగాయత్‌ సభ్యులు

- రాష్ట్రపతిని కలిసి విన్నవించిన వీరశైవ లింగాయత్‌ సభ్యులు

బోధన్‌: తెలుగు రాష్ట్రాల్లో వెనుకబడిన వీరశైవ లింగాయత్‌, లింగ బలిజలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సంఘం రాష్ట్ర ప్రతినిధులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని బోధన్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది, రాష్ట్ర ప్రతినిధి జి.దినేశ్‌ పాటిల్‌ శుక్రవారం తెలిపారు. మహాత్మా బసవేశ్వరుడి చిత్రపటం, శాలువాను అందించి రాష్ట్రపతిని సన్మానించినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో 2009లో లింగాయత్‌లను బీసీ జాబితాలో చేర్చడంతో అన్ని విధాల లబ్ధి చేకూరిందని, ఓబీసీ జాబితాలో లేనందున కేంద్ర ఉద్యోగ, విద్య అవకాశాలను కోల్పోయి నష్టపోతున్నామని వినతి పత్రంలో పొందుపర్చినట్లు వివరించారు. ఈ విషయమై రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, కార్యదర్శి శెట్టి శివకుమార్‌, ప్రతినిధులు శివరత్నం, కల్వ మల్లికార్జున్‌ అప్ప, శివప్ప, కర్నె రాజశేఖర్‌, సోమేశ్వర్‌, అనిల్‌కుమార్‌, మధుసూదన్‌ పాల్గొన్నారని పేర్కొన్నారు.

సిమెంట్‌ బ్రిక్స్‌ ఏర్పాటు



పనులను పరిశీలిస్తున్న ట్రాఫిక్‌ సీఐ

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్‌ ఇబ్బందులు, ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సిమెంట్‌ బిక్స్‌ తోపాటు స్ప్రింగ్‌కొలాన్స్‌ ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాఫిక్‌ సీఐ చందర్‌రాథోడ్‌ తెలిపారు. నగరంలోని వర్ని చౌరస్తా వద్ద సిమెంట్‌ బ్రిక్స్‌, స్ప్రింగ్‌కోలాన్స్‌ల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. నగరంలోని బోధన్‌రోడ్డు, నాందేవ్‌వాడ, పలు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ ఇబ్బందులు కలుగకుండా చేస్తున్నట్లు తెలిపారు.

ఓటరు నమోదును ప్రోత్సహించే వీడియోలు చేయాలి

కామారెడ్డి క్రైం : ప్రజల్లో ఓటరు నమోదును ప్రోత్సహించడానికి పోస్టర్‌లు, చిన్న నిడివి గల వీడియోలను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ శుక్రవారం తెలిపారు. చిహ్నాలు, రంగులు, నాయకులు మొదలైన రాజకీయ అర్థాలతో కూడిన ఎంట్రీలు పరిగణలోకి తీసుకోరన్నారు. ఏ భాషలోనైనా పోస్టర్‌, వీడియో రూపొందించి పంపవచ్చన్నారు. ఆసక్తి గల వారు 23లోగా తమ ఎంట్రీలను వెబ్‌సైట్‌ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు.

క్రైం కార్నర్‌

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి



అరుణ (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లికి చెందిన శ్రీగాథ అరుణ(35) అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు రూరల్‌ సీఐ శ్రీనివాస్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అరుణ బీడీలు చుడుతూ జీవనం సాగించేది. తల్లి సావిత్రితో కలిసి ఓ ఇంట్లో అద్దెకు ఉండేది. ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లిన అరుణ తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా లభించలేదు. నర్సన్నపల్లిలో ఖాళీగా ఉన్న డబుల్‌ రూం ఇంట్లో కుళ్లిపోయిన మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోలీసులు మృతురాలిని అరుణగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానస్పదస్థితి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



బుచ్చన్న (ఫైల్‌)

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మోపాల్‌కు చెందిన కెంపు బుచ్చన్న (42) పాము కాటుకు గురికాగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బుచ్చన్న వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీలాగే ఈనెల 12న పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా పాముకాటు వేసింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కంఠేశ్వర్‌లో వివాహిత..

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన ఎలిగేటి మానస (37) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రూరల్‌మండలంలోని గుండారం గ్రామానికి చెందిన మానస, కంఠేశ్వర్‌కు చెందిన యాదగిరితో 2006లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆగస్టు 28న యాదగిరి మద్యం సేవించి మానసను కొట్టాడు. దీంతో బాధతో మానస పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మానస సోదరుడు సతీశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి నిందితుల అరెస్ట్‌



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌

ఖలీల్‌వాడి: బైకులను చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్‌ తెలిపారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన మంతెన నరేశ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దుబ్బకు చెందిన గైనికొండ సురేశ్‌, మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన కోడెం ఆనంద్‌ పాత నేరస్తులని, దొంగతనం కేసులో ఇద్దరు జైలు జీవితం అనుభవించినట్లు చెప్పారు. జైలులో పరిచయమైన ఇద్దరు జల్సాలకు అలవాటు పడి ఐదు బైక్‌లను దొంగతనం చేసినట్లు తెలిపారు. ఓ బైక్‌ను బోధన్‌లో అమ్మడానికి వెళ్తుండగా నగరంలోని బోధన్‌ బస్టాండ్‌ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు చెప్పారు. వీరిని విచారించి ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, ఎస్సై విష్ణుప్రకాశ్‌ ఉన్నారు.

బతికున్న కుమార్తెకు దినకర్మ

- ప్రేమించిన వ్యక్తితో వెళ్లిపోయిందని తల్లిదండ్రుల కోపం

ఖలీల్‌వాడి: అల్లారు ముద్దుగా పెంచిన కుమార్తె భర్తతో విడిపోయి ప్రేమించిన వ్యక్తితో వెళ్లిపోయిందనే కోపంతో ఆ తల్లిదండ్రులు గురువారం దశదినకర్మ చేశారు. నగరంలోని ఓ కాలనీకి చెందిన యువతికి తల్లిదండ్రులు వివాహం జరిపించారు. కొన్నాళ్లకు భర్తకు బోన్‌క్యాన్సర్‌ అని తెలియడంతో తల్లి గారింటికి వచ్చేసింది. దీంతో సదరు యువతి తాను ప్రేమించిన వ్యక్తితో ఇటీవల వెళ్లిపోయింది. దీంతో తమ పరువు తీసిందంటూ బతికున్న కుమార్తెకు ఆ తల్లిదండ్రులు దశదినకర్మ చేశారు. ఈ నెల 10న తమ కుమార్తె చనిపోయిందని 14న దినకర్మ పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. ఇది కాస్త సోషల్‌మీడియాలో వైరల్‌అవుతోంది.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి షేక్‌ షాహీద్‌(14) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న షేక్‌ షాహీద్‌ మానసికస్థితి బాగా లేదని, కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చిన షాహీద్‌ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్తం..

వర్నిలో బైక్‌ చోరీ

వర్ని: మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం చోరీకి పాల్పడ్డారు. మండలంలోని కోటయ్య క్యాంపు గ్రామానికి చెందిన కంటిపూడి రమేశ్‌ పనినిమిత్తం బైక్‌పై బ్యాంకుకు వచ్చాడు. బ్యాంకు నుంచి తిరిగి వచ్చేసరికి బైక్‌కనిపించక పోవడంతో సీసీ కెమెరాలో ఇద్దరు నిందితులు చోరీకి పాల్పడినట్లు రికార్డు అయింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బంజార తండా వద్ద శుక్రవారం బైక్‌ అదుపుతప్పి కిందపడడంతో యువకునికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని జలాల్‌పూర్‌ గ్రామానికి చెందిన దారబోయిన నాగరాజు తన టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనంపై గోపాల్‌పేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా బంజారతండా వద్ద వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో నాగరాజుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళపై కేసు నమోదు

నిజామాబాద్‌ రూరల్‌: విధి నిర్వహణలో మహిళా కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. విద్యుత్‌నగర్‌లో నివాసం ఉంటే ఎస్‌కే సల్మాబేగం శుక్రవారం రూరల్‌ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌ అనురాధపై దురుసుగా ప్రవర్తించి నెట్టివేసింది. దీంతో హెడ్‌కానిస్టేబుల్‌ ఫిర్యాదు మేరకు సల్మాబేగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.